క్లుప్తంగా

నేడు ఉద్యోగ మేళా

మండపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అరబిందో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ టీవీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐటీఐ చదివిన వారు, ఇంటర్లో కెమిస్ట్రీ చదివి ఏదైనా డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ వారు, పాలిటెక్నిక్ డిప్లమా, బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన వారు హాజరు కావచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 79814 14513, 94201 2265, 78932 17981 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కృష్ణమూర్తికి మండేలా గ్లోబల్‌షిప్ అవార్డు


అవార్డు అందుకుంటున్న కృష్ణమూర్తి

కె.గంగవరం: గ్రామానికి చెందిన కె.కృష్ణమూర్తి నెల్సన్ మండేలా మెమోరియల్ గ్లోబల్‌షిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో మదర్‌ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దాసరి మహేష్, పి.సురేష్‌బాబు తదితరుల చేతుల మీదుగా కృష్ణమూర్తి ఈ అవార్డు అందుకున్నారు. అరుదైన గౌరవం కృష్ణమూర్తి అందుకోవడంపై పలువురు గ్రామ పెద్దలు, శ్యామ్‌ప్రసాద్ స్కూల్ సిబ్బంది తదితరులు అభినందించారు.

పోస్టల్ సిబ్బంది సేవలు అభినందనీయం


నారాయణరావును అభినందిస్తున్న రామకృష్ణ

మండపేట: పోస్టల్ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో మండపేట పోస్టల్ సిబ్బంది ముందంజలో ఉన్నారని రామచంద్రపురం పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.రామకృష్ణ అన్నారు. స్థానిక హెడ్ పోస్టాఫీసును శుక్రవారం ఆయన సందర్శించారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకంలో రూ.50 లక్షల పాలసీ, రూ.1,28,000లు ప్రీమియం చేయించిన పోస్టల్ ఉద్యోగి కేవీ నారాయణరావును ప్రశంసించారు. పోస్ట్‌మాస్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డ్ పోస్టుమాస్టర్ టి.పుల్లేశ్వరరావు, ఐపీ తాతినాయుడు, ఉద్యోగులు కొండపల్లి సూర్యనారాయణ వి.గోవింద్, ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని ఇటీవల పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్‌గా నియమితులైన పాలింగి కృష్ణకిశోర్ అన్నారు. అంగరలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో అన్నివర్గాల సమన్వయంతో పార్టీ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: యానం, ద్వారపూడి రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరానికి చెందిన పట్నాల రామకృష్ణ తన బైక్‌పై యానం వెళుతున్నారు. మండలంలోని కోలంక వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించుకు వెళ్లబోయి రోడ్డుపక్కన ఉన్న పంటకాలువలోకి బైక్‌తో సహా పల్టీలు కొట్టాడు. అటుగా వెళ్లుతున్న ప్రయాణికులు గమనించి గాయాలపాలైన అతడిని చికిత్స నిమితం యానం ఆసుపత్రికి తరలించారు.

కొడవలితో దాడి చేసిన ఘటనపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లిలో కొడవలితో దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొమ్మె రవి, దుర్గాప్రసాద్‌లు ఒకే వ్యక్తి వద్ద కూలికి వెళ్లేవారు. యజమానితో తనపై లేనిపోనివి చెప్పి తనను పనిలో నుంచి తప్పించారన్న అనుమానంతో దుర్గాప్రసాద్ రవిపై కొడవలితో దాడి చేసి చేతిపై నరికాడు. దీనితో తీవ్ర గాయం కావడంతో వైద్యం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి సమాచారం, బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తికి మూడు నెలల జైలు

కపిలేశ్వరపురం: మోటార్ సైకిల్ చోరీ చేసిన కేసులో నేరం రుజువు కావడంతో సోమేశ్వరం గ్రామానికి చెందిన దాసరి దుర్గాప్రసాద్‌కు మూడు నెలల సాధారణ జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప శుక్రవారం తీర్పు చెప్పారు. తన మోటార్ సైకిల్ పోయిందంటూ కోరుమిల్లికి చెందిన కాకులపాటి సత్యనారాయణ 2019 అక్టోబర్ 10న ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఎస్సై ఎం.ఏసుబాబు కేసు నమోదు చేశారు. తర్వాత విధుల్లో చేరిన ఎస్సై బి.సంపత్ కుమార్ కేసును దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో దుర్గాప్రసాద్‌కు పైవిధంగా శిక్ష పడిందని అంగర ఎస్సై జి.చంటి తెలిపారు.

సొంతింటి వారమండీ..

- నెరవేరుతున్న పేదల కల
- 565 గృహ నిర్మాణాలు పూర్తి
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


మాచవరంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం

రాయవరం: నవరత్నాల పథకాల్లో భాగంగా పేదల సొంతింటి కల సాకారం అవుతోంది. వచ్చే నెలలో గృహ ప్రవేశాల పండుగలకు అంతా సిద్ధమవుతోంది. ఒకేసారి వందలాది మంది గృహ ప్రవేశాలు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. లక్ష్యం మేరకు జగనన్న కాలనీల్లో అన్ని వసతులతో సర్వాంగ సుందరంగా గృహాలు పూర్తి కావొస్తున్నాయి. పేదల మోముల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. రాయవరం మండలం వెదురుపాక, నదురుబాద, సోమేశ్వరం, లొల్ల, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం గ్రామాల్లో 19 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్లలో 1,625 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను ఇవ్వడమే కాకుండా వారికి గృహ నిర్మాణ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక, ఐరన్, గుమ్మాలు, కిటికీలు తదితర నాణ్యమైన సామగ్రిని ప్రభుత్వమే అందజేస్తోంది. ముఖ్యంగా ఈ గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేసిన నాలుగైదు రోజులకే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా సొమ్ము జమ అవుతుంది. అలాగే కాలనీల్లో విద్యుత్ సౌకర్యాన్ని, పూర్తయిన గృహాలకు విద్యుత్ మీటర్లను కూడా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇంటర్నల్ రహదారుల అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి

మండలంలో వివిధ గ్రామాల్లో 1,625 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 565 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 1,060 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటి వరకూ ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులకు రూ.11.02 కోట్ల నిధులను వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేశారు. అలాగే 3.45 కోట్ల విలువైన మెటీరియల్‌ను అందజేశారు. మొత్తం ఇప్పటి వరకు నగదు, మెటీరియల్ రూపేణా రూ.14.48 కోట్లు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే పొదుపు మహిళలకు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున రూ.4.5 కోట్లు ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయంగా అందజేశారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు గృహ ప్రవేశాలు చేయించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం. ఇప్పటికే చాలా నిర్మాణాలు పూర్తి కాగా, పూర్తయ్యే దశలో ఇంకా ఉన్నాయి. గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉంది. నిధుల సమస్య కూడా లేదు.

– కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఏఈ, గృహనిర్మాణ శాఖ, రాయవరం

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటి స్థలంతో పాటు ఇంటి రుణం కూడా మంజూరు చేశారు. త్వరితగతిన ఇంటి నిర్మాణాన్ని కూడా పూర్తి చేసుకున్నాం. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారంతో పాటు మేము కూడబెట్టుకున్న కొంత నగదును వెచ్చించి సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నాం. ఇప్పుడు మాకు చాలా సంతోషంగా ఉంది.

– తాడి సీత, లబ్ధిదారు, మాచవరం

జగనన్నకు రుణపడి ఉంటాం

సొంతిల్లు లేని మాలాంటి ఎంతో మందికి ఇంటి పట్టాలను ప్రభుత్వం ఇచ్చింది. అంతేకాకుండా ఇంటిని కట్టించి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో ఇంటిని పూర్తి చేసుకున్నాం. ఇప్పటి వరకూ రూ. 1.80 లక్షలు బ్యాంకు అకౌంట్‌లో పడింది.

– వినకోట నాగకుమారి, చెల్లూరు

అద్దె అవస్థలు తప్పాయి



నా భర్త, పిల్లలతో అద్దె ఇంట్లో నివసించేవాళ్లం. సొంతిల్లు నిర్మించుకోవడంతో అద్దె అవస్థలు తప్పాయి. అద్దె ఇంటి నుంచి సొంతింటిలోకి వెళ్తున్నందుకు సంతోషంగా ఉంది. పేదలకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వం పదికాలాలు చల్లగా ఉండాలి.

– చింతా శ్రీలక్ష్మి, మాచవరం

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం


బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఎనిమిదవ సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గోల్ వేసి ప్రారంభించారు. బాస్కెబాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి మాతృమూర్తి భానుమతి జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 12 బాలుర, 9 బాలికల జట్లు తలపడనున్నారు. ఎంపికైన బాల బాలికలు ఆగస్టు రెండో తేదీ నుంచి పాండిచ్చేరిలో జరిగే సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్‌లు తోట అమ్మాజీ, కేతా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్, మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య కాశీ అంతిమయాత్ర

కె.గంగవరం: సత్యవాడ గ్రామ మాజీ సర్పంచ్ తోట కాశీ అంతియయాత్ర శుక్రవారం అశ్రునయనాల మధ్య సాగింది. మండలంలోని పలు గ్రామాల నుంచే కాకుండా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బంధువులు, స్నేహితులు, సామాన్య ప్రజలు సత్యవాడ గ్రామానికి చేరుకుని అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు సత్యవాడ చేరుకుని కాశీ మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు


మాచర శివారులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మాచరలో గడప గడపకూ..

కపిలేశ్వరపురం: అన్ని వర్గాల ప్రజలకు రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మాచర గ్రామ శివారు శ్రీరాంపురం, మాచర మట్లలు గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ నేత తోట పృథ్వీరాజ్, సర్పంచ్ వాసంశెట్టి సునీత, పీఏసీఎస్ చైర్మన్ కరెడ్ల చంటిబాబు, నాయకులు శీలం గోవింద్, వాసంశెట్టి విష్ణు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావుతో కలసి ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్య క్రమంలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తిరిగి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామంతో పాటు సమీప గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల సచివాలయాల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, సేవాదళ్ కన్వీనర్ పాలింగి కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసానిచ్చే ప్రభుత్వం


పట్టణంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

మంత్రి చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి ప్రజలకు భరోసాను కల్పించిన సీఎం జగన్ నాయకత్వంలోని ప్రభుత్వమేనని రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు కొత్తూరులో గడప గడపకూ కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి వేణు నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు ప్రభుత్వం ద్వారా పొందిన పథకాల లబ్ధిని వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అవినీతి లేని పాలనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వేణు అన్నారు. ప్రతి ఇంటికీ ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. పురపాలక పరిధిలో చక్కటి పారిశుధ్యం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పురపాలక సంఘం పరిధిలోని 25వ వార్డులో ఉన్న మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పట్టణాన్ని స్వచ్ఛ రామచంద్రపురంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. అందులో భాగంగానే ప్రతి ఇంటికీ మొక్కలను అందించటం జరుగుతుందన్నారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కంచుమర్తి బాబూరావు, పెంటపాటి శ్రీను, మాజీ కౌన్సిలర్ చింతపల్లి వెంకట్రావు, ఎస్సై డి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు


మాచరలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: మాచర గ్రామ బీసీ ఏరియాలో టీడీపీకి చెందిన సుమారు 25 మంది కార్యకర్తలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మెచ్చి అనేక మంది పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు వెంట నడవడం గర్వంగా ఉందని పార్టీలో చేరిన వాసంశెట్టి శ్రీను, వనుం వీరరాఘవులు, మేడిశెట్టి శ్రీను, కడలి సత్యనారాయణ తదితరులు అన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

మాచర అరుంధతీపేటలో రూ.15 లక్షల ఎస్‌డీఎఫ్, మండల పరిషత్ నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్ వాసంశెట్టి సునీత, పీఏసీఎస్ చైర్మన్ కరెడ్ల చంటిబాబు, నాయకుడు వాసంశెట్టి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల లిస్టులో తప్పుల సవరణకు సహకరించాలి


ద్రాక్షారామలో అవగాహన కల్పిస్తున్న వీఆర్వో సాయిబాబు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండల ఎన్నికల అధికారి పి.తేజేశ్వరరావు సూచనల మేరకు ద్రాక్షారామ గ్రామ ఓటర్ల లిస్టులో తప్పులు సరిచేయడానికి ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని గ్రామ వీఆర్‌ఓ కె.సాయిబాబు కోరారు. గ్రామ సచివాలయంలో శుక్రవారం అన్ని పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు, ప్రజా ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

కాజులూరు: సమాజంలో ప్రతి పౌరుడు ఓటుహక్కు కలిగి ఉండాలని మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ అన్నారు. శుక్రవారం కాజులూరు మండల గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ఓటరు నమోదుపై ఇంటింటి సర్వే చేపట్టారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకూ గ్రామాల్లో అధికారులు సర్వే చేపట్టి ఓటరు సవరణ, కొత్త ఓట్ల నమోదు నిర్వహిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఆర్ఐ వేగేశ్వరరావు, వీఆర్వోలు ఈశ్వరరావు, వరలక్ష్మి, వీఆర్‌ఏ డి.కృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాల లబ్ధి


కోరుమిల్లి సురక్ష గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

కపిలేశ్వరపురం: అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ నేత తోట పృథ్వీరాజ్ అన్నారు. కోరుమిల్లి -2 సచివాలయ పరిధిలో శుక్రవారం సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ జరిగింది. ఎంపీడీఓ ఎం.రామకృష్ణ, తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీటీసీ సభ్యుడు సుంకర వెంకటేశ్వరరావుతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సచివాలయ కన్వీనర్లు వింటి మంగాదేవి, అల్లాడి విజయ్‌శేఖర్, నాయకులు సలాది వీరబాబు, పేరాబత్తుల రామకృష్ణ, ఆచంట వీవీ స్వామి, వెలుగుబంటి పోనంరాజు, దంగేటి సతీష్, నందికోళ్ల మనేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు నోటీసులు

కె.గంగవరం: మండలంలోని 18 మంది హెచ్‌ఎంలకు డీఈఓ ఎం.కమలకుమారి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాడు–నేడు పనులకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహించారంటూ హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేశారు. నోటీసులో పని పూర్తయినా కూడా బిల్లులు అప్‌లోడ్ చేయడంలో ఎందుకు తాత్సారం చేశారో లిఖిత పూర్వకంగా సమాధానం చెప్పాలని, వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. దీనిపై యూటీఎఫ్ నాయకులు మాగాపు ప్రదీప్‌కుమార్, పి. వెంకటేశ్వరరావు తదితరులు డీఈఓ కార్యాలయానికి వెళ్లి ఆమెను కలసి వివరణ ఇచ్చారు. పని పూర్తయినా బిల్లులు ఆలస్యంగా వచ్చాయని, దీని కారణంగా అప్‌లోడ్ చేయడానికి ఆలస్యమయిందని ఆమెకు వివరణ ఇచ్చారు.

చిన్నారికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెంలో శుక్రవారం చిన్నారి ఇంజేటి అలెక్స్‌కు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. చిన్నారికి ఎడమ కన్ను దెబ్బతిని ట్రీట్‌మెంట్ తీసుకుంటోంది. ఈ తరుణంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులు కలసి కొంత సొమ్మును సమకూర్చారు. దీనిని ఎమ్మెల్యే చిన్నారికి అందజేశారు. ఈ విషయాన్ని అమలాపురం పర్యటనకు రానున్న సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి, తగిన సహాయం అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గుండెల్లో గోదావరి

- పెరుగుతున్న నీటిమట్టం
- ఆందోళనలో పరీవాహక ప్రాంత ప్రజలు


కోటిపల్లిరేవులో షాపుల వద్దకు చేరిన వరద నీరు


కూళ్ల వద్ద ఏటిగట్టును పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్ తదితరులు


కేదారిలంకలో గోదావరి వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కె.గంగవరం: వర్షాకాలం వచ్చిందంటే గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ఏటా గోదావరికి వచ్చే వరదలకు ఏటిగట్టు కోతకు గురవడమే దీనికి కారణం. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు మండలాల మీదుగా ఉన్న గౌతమి నది గోదావరి పలు చోట్ల తీవ్ర కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కె.గంగవరం మండలం కూళ్ల వద్ద నుంచి కాజులూరు మండలం కోలంక వరకు సుమారు 30 కిలోమీటర్ల వరకు గోదావరి తీర ప్రాంతం ఉంది. ఏటిగట్టు పొడవునా సుందరపల్లితో పాటు సుమారు 12 చోట్ల ఏటిగుట్టు భారీగా కోతకు గురవుతుంది. ఏటా గోదావరికి వచ్చే వరదల సమయంలో తీర ప్రాంత ప్రజలు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

కె.గంగవరం మండలంలోని ఏటిగట్టు మరింత ప్రమాదకంరగా ఉంది. కోటిపలి–కోట, బ్రహ్మపురి–గోవలంక మధ్య ఉన్న ఏటిగట్టు కోతకు గురై బెర్మ్‌లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి భారీగా వరద చేరుతుంది. ఈ వరదని కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదలడం వల్ల కోటిపల్లిలో వరద పెరుగుతుంది. ఈ రాత్రికి మరింత వరద చేరుతుందని స్థానిక రెవెన్యూ అధికారులు చెప్పడంతో మత్స్యకార కాలనీలో ఆందోళన నెలకొంది. గోదావరికి వరద నీరు భారీగా వచ్చి చేరుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వైద్యనాథ శర్మ అన్నారు.

ఏటిగట్టు పరిశీలన

మండలంలోని కూళ్ల, సుందరపల్లి, కోట వద్ద గల ఏటిగట్టును శుక్రవారం అమరావతి జీడీఎస్ సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ ఆర్ సతీష్‌కుమార్, ఇతర పీడబ్ల్యూడీ అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉందని బలహీనంగా ఉన్న చోట్ల కర్రలు, ఇసుక బస్తాలు వేసి బలపర్చాలని అధికారులకు ఆదేశించారు. బలహీనంగా ఉన్న ఏటిగట్టును పటిష్టం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వరద ఉధృతిపై అప్రమత్తంగా ఉన్నామని అధికారులకు కూడా ప్రత్యేక విధులు అప్పగించి గట్ల వద్ద గస్తీ ఏర్పాటు చేశామని చెప్పారు.

లంక గ్రామాల్లో పరిశీలన

కపిలేశ్వరపురం: గోదావరి వరద నిలకడగా ప్రవహిస్తుంది. రెండు రోజులుగా అధికారులు మండలంలోని లంక గ్రామాల్లో పర్యటిస్తున్నారు. కేదారిలంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లవులంక గ్రామాలను తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణ, సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పోలిశెట్టి గణేష్ సందర్శించారు. ఆయా గ్రామాల అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం గ్రామాల శివారులోని వ్యవసాయ క్షేత్రాలకు వరద నీరు తాకింది. నీటిమట్టం పెరిగితే మరింత అప్రమత్తం కావాలని ఆదేశించారు.